క్లుప్తంగా

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ



అల్పాహారం ప్యాకెట్లు అందజేస్తున్న మోహన్

బషీరాబాద్: మండలంలోని ఎక్మాయి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి నాదిరిగ మోహన్ అల్పాహారం శుక్రవారం అందజేశారు. విద్యార్థులకు సాయంత్రం వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండడంతో వారికి అల్పాహారం పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. పూర్వ విద్యార్థి మోహన్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన



అమ్మవారిని దర్శించుకున్న ఎంపీపీ కరుణ తదితరులు

బషీరాబాద్: మండలంలోని కుప్పన్‌కోట్ తండాలో గ్రామ దేవతల విగ్రహాలను గ్రామస్తులు ప్రతిష్ఠించారు. రెండు రోజులుగా ప్రత్యేక పూజలు చేసి శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఏరడమ్మ, ఎల్లమ్మ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఎంపీపీ కరుణ, గ్రామ మాజీ సర్పంచ్ పద్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో తండాకు చెందిన ఆడపడుచులు, బంధువులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజశేఖర్

అనంతగిరి: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మా శారద ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీకర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెంగోల్ జీపీలో జీరో బడ్జెట్



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రత్యేకాధికారి ఎంఈఓ వెంకటయ్య

తాండూరు రూరల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. శుక్రవారం చెంగోల్ జీపీ కార్యాలయంలో ప్రత్యేకాధికారిగా ఎంఈఓ వెంకటయ్య బాధ్యతలు స్వీకరించారు. గ్రామ పంచాయతీలో ఒక్క రూపాయి కూడా బడ్జెట్ లేదని పంచాయతీ కార్యదర్శి సరితారెడ్డి చెప్పడంతో ప్రత్యేకాధికారి ఎంఈఓ వెంకటయ్య అవాక్కయ్యారు. చింతమణిపట్నంలో కూడా ఆయన బాధ్యతలు చేపట్టారు. గౌతపూర్‌లో పంచాయతీ రాజ్ డీఈ వెంకట్రావ్ ప్రత్యేకాధికారిగా వెళ్లారు. మాజీ సర్పంచ్ రాజప్పగౌడ్ ప్రత్యేకాధికారి వెంకట్రావ్‌ను సన్మానించారు.

ఆలయ నిర్మాణానికి సహకరించండి

కొడంగల్: పట్టణ శివారులోని బండల ఎల్లమ్మ ఆలయం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ధర్మశాస్త అయ్యప్ప స్వామి ఆలయానికి దాతలు సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. శుక్రవారం అయ్యప్ప స్వామి భక్తులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించారు. నిర్మాణంలో విరాళాలు ఇస్తామని చెప్పిన భక్తులు తొందరగా ఇచ్చి సహకరించాలని కోరారు. తమిళనాడు నుంచి సామగ్రి తీసుకు రావాల్సి ఉందన్నారు. ఇందుకు పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం ఉందన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తలారీ గోపాల్ తన మొదటి నెల జీతంలో రూ.20 వేలు అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు డాక్టర్ రవీంద్రాయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, ఉమాపతి గౌడ్, నర్సిరెడ్డి, కిషన్‌ధాగ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతికి ‘పీటీఎం’

- ప్రతి నెలా మూడో శనివారం సమావేశం
- తరగతుల వారీగా తల్లిదండ్రులతో చర్చలు



బాలంపేట ఉన్నత పాఠశాలలో సమావేశం (ఫైల్)

దౌల్తాబాద్: ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా గతంలో ఉన్న ఎస్ఎంసీ(స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ)లు పాఠశాలల్లోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నాయి. వీటితో పాటు ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రతి పాఠశాలలో నూతనంగా పీటీఎం(పేరెంట్స్, టీచర్స్ మీట్) సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రతి నెల మూడో శనివారం ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు తరగతుల వారీగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి చిన్నారుల సామర్థ్యాలను తెలుసుకుంటున్నారు.

ప్రధానోపాధ్యాయుని పర్యవేక్షణలో..

మండలంలో ప్రభుత్వ పాఠశాలలు 50, ఒక కస్తూర్బా పాఠశాల ఉంది. ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే పీటీఎం సమావేశం గురించి ముందుగానే విద్యార్థులు వారి తల్లిదండ్రులకు సమాచారం అందిస్తారు. సమావేశంలో విద్యార్థుల ప్రవేశాలు, హాజరు శాతం పెంపుపై సలహాలు, సూచనలు తీసుకుంటారు. పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, వసతుల గురించి తెలిపి అభివృద్ధిలో భాగస్వాముల్ని చేస్తారు. విద్యార్థుల ప్రగతి కోసం ఉపాధ్యాయులు చేపడుతున్న నూతన కార్యక్రమాలను వివరిస్తారు. మధ్యాహ్న భోజన మెనూ అమలుతో పాటు ప్రధానోపాధ్యాయుని పర్యవేక్షణలో తరగతి ఉపాధ్యాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులతో పీటీఎం నిర్వహించి ప్రగతిని తెలుపుతారు.

“హాజరు శాతం పెరిగింది



నెలలో మూడో శనివారం మా పాఠశాలలో పీటీఎం సమావేశాలు నిర్వహిస్తున్నాం. తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థుల ప్రగతి వివరిస్తాం. ఈ సమావేశాలతో విద్యార్థుల హాజరు శాతం పెరిగింది. కానీ తల్లిదండ్రులు తక్కువగా వస్తున్నారు.

– రాజు, హెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్, బాలంపేట

తల్లిదండ్రులకు వివరిస్తాం

పీటీఎం సమావేశాలకు తల్లిదండ్రులు హాజరు కావడం ద్వారా పాఠశాల అభివృద్ధిలో వారి భాగస్వామ్యం పెరుగుతోంది. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతి గురించి తల్లిదండ్రులకు వివరిస్తారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెబుతారు.

– వెంకటయ్య, ఎంఈఓ, దౌల్తాబాద్

సాదాసీదాగా సామాజిక తనిఖీ

ప్రజావేదికలో అక్రమాలపై అధికారుల ఆగ్రహం

నవాబుపేట: మండలంలో గత వారం రోజులుగా నిర్వహించిన ఉపాధిహామీ సామాజిక తనిఖీ సాదాసీదాగా జరిగినట్లు శుక్రవారం జరిగిన ప్రజావేదిక సభలో వెల్లడైంది. నవాబుపేట మండలంలో 2022 ఫిబ్రవరి నుంచి 2023 మార్చి వరకు 645 పనులకు గానూ రూ.6,24,17,311 ఖర్చు చేశారు. ఈ విషయమై గత వారం రోజులుగా మండలంలోని అన్ని గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం ప్రజావేదిక బహిరంగ సమావేశం నిర్వహించి రిపోర్టులను ప్రకటించారు. చాలా గ్రామాల్లో పంచాయతీరాజ్ శాఖ చేపట్టిన అభివృద్ధి పనులకు చెందిన రికార్డులు ఇవ్వలేదని, చాలా గ్రామాల్లో కూలీల సంతకాలు సైతం లేకుండానే పేమెంట్లు చేసినట్లు, నర్సరీల రికార్డులు రాయనట్లు, సీడ్ కొన్నా బిల్లులు లేకపోవడం తదితర అంశాలను గుర్తించారు. తనిఖీ బృందాలు వెల్లడించిన వివరాలను పరిశీలించిన అధికారులు పలువురు పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని నిర్ణయించారు. అనంతరం అడిషనల్ పీడీ మాట్లాడుతూ.. ప్రస్తుత ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా సిబ్బంది పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ సరళ, ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఏపీఓ లక్ష్మీదేవి, తనిఖీ బృందాలు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి మేలు

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్



శిక్షణ కేంద్రం వద్ద బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు

పరిగి: నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాలపై ఆశ పడకుండా స్వయం ఉపాధిని ఎంచుకుని ఆర్థికంగా ఎదగాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, సినిమా సెన్సర్‌బోర్డు మెంబర్ మల్లేశ్ పటేల్ సూచించారు. మండల పరిధిలోని రంగంపల్లిలో శ్రీ సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఉచితంగా అందిస్తున్న టైలర్ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సత్యసాయి ట్రస్ట్ ద్వారా నిరుపేద కుటుంబాలకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు వెంకట్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేశాం



దౌల్తాబాద్: సన్మానం పొందిన సర్పంచ్, వార్డు సభ్యులు

దౌల్తాబాద్: తిమ్మారెడ్డిపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుంచడమే లక్ష్యంగా ఐదేళ్లు పని చేశానని తాజా మాజీ సర్పంచ్ మంజుల అన్నారు. శుక్రవారం గ్రామంలో పాలకవర్గానికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. అందరితో కలిసి రాజకీయాలకతీతంగా పనిచేశామన్నారు. తనను గెలిపించిన గ్రామస్తులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అనురాధ, నాయకులు నర్సిములు, రాములు, సాయిలు తదితరులున్నారు.

సర్పంచ్‌లకు వీడ్కోలు

యాలాల: సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారులు గ్రామ పాలన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలోని 37 పంచాయతీల్లో పాలక మండలి సభ్యులను సన్మానించి వీడ్కోలు పలికారు. మండల పరిధిలోని ముద్దాయిపేట, బషీర్‌మియాతండా, హాజీపూర్, దేవనూరు, కోకట్, అగ్గనూరు, జుంటుపల్లి, బెన్నూరు తదితర గ్రామాల్లో ప్రత్యేకాధికారులు పాలన పగ్గాలు చేపట్టారు.

సేవ చేసే అదృష్టం

మోమిన్‌పేట: గ్రామ ప్రజలకు సేవ చేసే అదృష్టం సర్పంచ్ పదవి వల్ల రావడంతో చాల తృప్తి నిచ్చిందని తాజా మాజీ సర్పంచ్ పన్నాల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మొరంగపల్లి గ్రామ పంచాయతీ పాలక వర్గ సన్మాన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజారెడ్డి, ఎంపీఓ యాదగిరి, మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య, నాయకులు మాణయ్య, పాండురంగారెడ్డి, మల్లారెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.



యాలాల: హాజీపూర్‌లో మాజీ సర్పంచ్‌ను సన్మానిస్తున్న పాలకవర్గ సభ్యులు

సమన్వయంతో అభివృద్ధి

బంట్వారం: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ ప్రభాకర్ అన్నారు. సర్పంచ్‌ల వీడ్కోలు సమావేశం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. ఐదేళ్లుగా కలిసి పని చేసిన అనుభూతిని ఆయన అందరితో పంచుకున్నారు. అనంతరం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలయ్య, ఎంపీఓ విజయ్‌కుమార్, సూపరిండెంట్ షిండే తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు ప్రత్యేకాధికారులు

బాధ్యతలు స్వీకరించిన అధికారులు



బంట్వారం: సుల్తాన్‌పూర్ జీపీలో ప్రత్యేకాధికారి విజయ్‌కుమార్‌ను సన్మానించిన మాజీ పాలకవర్గం

పెద్దేముల్: సర్పంచ్‌ల పాలన ముగియడంతో శుక్రవారం నుంచి పంచాయతీలకు ప్రత్యేక పాలనాధికారులు వచ్చేశారు. పెద్దేముల్ మండలంలో 37 గ్రామ పంచాయతీలున్నాయి. అందుకు ప్రభుత్వం ఎనిమిది మంది గెజిటెడ్ అధికారులను నియమించింది. అడ్కిచెర్ల, ఆత్కూర్, బాయిమీదితండా, బండమిదిపల్లి, బందపల్లి, తట్టెపల్లి గ్రామాలకు మండల అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ) లక్ష్మప్పను నియమించింది. బుద్దారం, చైతన్యనగర్, దుగ్గాపూర్, ఎర్రగోడుతండా, గాజీపూర్ గ్రామాలకు డిప్యూటీ తహసీల్దార్ మహేశ్ ప్రత్యేకాధికారిగా వెళ్లారు. గిర్మాపూర్, గోపాల్‌పూర్, గొట్లపల్లి, హన్మాపూర్, ఊరేంటితండా, ఇందూరు గ్రామాలకు తహసీల్దార్ కిషన్‌ను నియమించింది. జైరాంతండా(ఇందూరు), జనగాం, జైరాంతండా(తట్టెపల్లి), కందనెల్లి గ్రామాలకు తాండూరు మైన్స్ ఏడి శ్యామేల్ జాకబ్. కందనెల్లితండా, ఖానాపూర్, కొండాపూర్, మదనంతపూర్, మంబాపూర్ గ్రామాలకు పంచాయతీ రాజ్ ఏఈ సిద్దార్థ. మన్‌సాన్‌పల్లి, మారేపల్లి, మారేపల్లి తండా, నాగులపల్లి గ్రామాలకు మండల ప్రత్యేకాధికారి లలిత కుమారి. ఓంలానాయక్‌తండా, పాషాపూర్, రుక్మాపూర్, సిద్దన్నమడుగుతండా, రుద్రారం గ్రామాలకు మండల వ్యవసాయ శాఖ అధికారి నజీరోద్దీన్. పెద్దేముల్, రెగోండి గ్రామాలకు పంచాయతీ అధికారి షేక్‌సుస్మాను నియమించినట్లు ఎంపీడీఓ లక్ష్మప్ప ఓ ప్రకటనలో తెలిపారు.

మర్పల్లిలో ప్రత్యేకాధికారులు

మర్పల్లి: ప్రభుత్వం గ్రామ పంచాయతీల పాలన వ్యవస్థను ప్రత్యేకాధికారులకు అప్పగించినట్లు ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లడారు. మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతి గ్రామ పంచాయతీకి ఓ ప్రత్యేకాధికారిని నియమించినట్లు తెలిపారు. కొత్లాపూర్, సిరిపురం, తుమ్మలపల్లి గ్రామాలకు ప్రత్యేకాధికారిగా తహసీల్దార్ గణేశ్ బాధ్యతలు చేపట్టనున్నారు. మొగిలిగుండ్ల, నర్సాపూర్, నర్సాపూర్‌తండా, పట్లూర్ గ్రామాలకు ఎంపీడీఓ రాజమల్లయ్య. పెద్దాపూర్, పంచలింగాల్, పిల్లిగుండ్ల, రావులపల్లి గ్రామాలకు డీవై ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శివకుమార్. శాపూర్, తిమ్మాపూర్ పశువైద్య శాఖ సహాయకులు నరేంద్రనాథ్‌రెడ్డి. బిల్‌కల్, దామస్తాపూర్, గుర్రంగట్టుతండా గ్రామాలకు మండల ఏఓ వసంత. బూచన్‌పల్లి, కోట్ మర్పల్లి, వీర్లపల్లి గ్రామాలకు ఎంపీఓ సుశీల్‌కుమార్. దార్గులపల్లి, ఘణాపూర్, గుండ్లమర్పల్లి గ్రామాలకు డిప్యూటీ తహసీల్దార్ రమేశ్. జంషేడ్‌పూర్, కల్‌ఖోడ గ్రామాలకు మిషన్ భగీరథ ఏఈ సాయినాథ్. కొంషేట్‌పల్లి, మల్లికార్జునగిరి గ్రామాలకు డీవై ఈఈ పీఆర్ జితేందర్. మర్పల్లికి డివిజినల్ పంచాయతీ అధికారి అనిత ప్రతేకాధికారులుగా నియమించారు.

కుల్కచర్ల స్పెషల్ ఆఫీసర్లు

కుల్కచర్ల: కుల్కచర్ల మండలంలోని 44 గ్రామ పంచాయతీలకు 13 మంది గెజిటెట్ అధికారులను ప్రభుత్వం నియమించింది. కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్‌కు కుల్కచర్ల, లాల్‌సింగ్ తాండ, రాంపూర్ గ్రామాలకు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఉపేందర్‌కు చౌడాపూర్, భజ్యానాయక్ తాండ, అడవివెంకటాపూర్, చౌడాపూర్. తహసీల్దార్ ప్రభుకు ఈర్లవాగు తాండ, బొర్రెహెమ్యనాయక్ తాండ, గోగ్యానాయక్ తాండ, మక్తవెంకటాపూర్, లింగంపల్లి. జియోలజిస్ట్ భాగ్యకు మందిపల్, వితలాపూర్, వాల్యానాయక్ తాండ, వీరాపూర్, ఎంపీడీఓ నాగవేణికి అల్లాపూర్, అంతారం, సాల్వీడు, బండవెల్కిచర్ల గ్రామాలకు ప్రత్యేకాధికారులుగా నియమించారు. మిగతా గ్రామాలకు సైతం పాలనా పగ్గాలు అధికారులు చేపట్టారు.

బంట్వారంలో

బంట్వారం: బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లోని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తొర్మామిడి, యాచారం పంచాయతీలకు తహసీల్దార్ ప్రవీణ్ కమార్. మండల కేంద్రం బంట్వారంతో పాటు బస్వాపూర్‌కు ఎంపీడీఓ బాలయ్య బాధ్యతలు స్వీకరించారు. బొప్పునారం, మద్వాపూర్ జీపీలకు ప్రసాద్ రావు(అసిస్టెంట్ లేబర్ కమిషనర్). మాలసోమారం, నాగవరం పంచాయతీలకు సంధ్య ఎఓ (వ్యవసాయ శాఖ). ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు చేపట్టారు.

కోట్‌పల్లిలో

కోట్‌పల్లితో పాటు లింగంపల్లి గ్రామాలకు రాజేశ్వర్ రావు(డీసీఎస్ఓ) ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారు. బార్వాద్, బార్వాద్ తండా జీపీలకు ఆశాజ్యోతి కోట్‌పల్లి(తహసీల్దార్). జిన్నారం, మోత్కుపల్లిలకు లక్ష్మీనారాయణ(ఎంపీడీఓ). ఇందోల్, ఓగులపూర్, ఎన్నారం, కొత్తపల్లి జీపీలకు డానియల్ (ఎంపీఓ) నియమితులయ్యారు. మిగతా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు సీకరించారు.

పంచాయతీలకు గెజిటెడ్ అధికారులు

ధారూరు: ధారూరు మండల పరిధిలోని 32 గ్రామ పంచాయతీలకు గెజిటెడ్ అధికారులను నియమించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని రాంపూర్‌తండా, గట్టెపల్లి, హరిదాస్‌పల్లి గ్రామ పంచాయతీలకు మండల వ్యవసాయ అధికారి ఝాన్సీలక్ష్మి. ధారూరు, కేరెల్లి, మున్నూరుసోమారం జీపీలకు మండల ప్రత్యేక అధికారి మల్లేశం. అంతారం, మోమిన్‌కలాన్, రాజాపూర్, మోమిన్‌ఖుర్దు జీపీలకు డిప్యూటీ తహసీల్దార్ విజయ్. అల్లాపూర్, నాగసమందర్, గడ్డమీది గంగారం, రుద్రారం జీపీలకు మిషన్ భగీరథ డీఈ రత్నప్రసాద్. అల్లీపూర్, నర్సాపూర్ ఎబ్బనూర్ జీపీలకు ఏడీఏ వినోద్‌కుమార్. ధర్మాపూర్, కుక్కింద, కొండాపూర్‌కలాన్, అవుసుపల్లి జీపీలకు తహసీల్దార్ భువనేశ్వర్. స్టేషన్‌ధారూరు, దోర్నాల్, నాగ్‌సాన్‌పల్లి, తరిగోపుల జీపీలకు ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డిని నియమించారు.

పర్యావరణ పరిరక్షణ ముఖ్యం

ధారూరు: మండల పరిధిలోని నాగసమందర్ గ్రామ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలంగాణ పాఠశాల విద్యాశాఖ కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ, ఎంగ్ ఎర్త్ లీడర్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పాఠశాల హెచ్ఎం ఉదయ్‌కుమార్ సూచించారు. కర్బన ఉద్గారాల, కాలుష్య కారకాలతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుదని వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని హెచ్ఎం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంగ్ ఎర్త్ లీడర్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి



నియామక పత్రం అందజేస్తున్న నాగప్ప

తాండూరు రూరల్: గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నారాయణపూర్, గోనూర్, వీర్‌శెట్టిపల్లి, పర్వాతపూర్ గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామాల్లో యూత్ కమిటీలు వేస్తున్నామని తెలిపారు. పార్టీకి యువతే వెన్నెముక అన్నారు. ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పురుషోత్తంరెడ్డి, నాయకులు జగదీష్, సుధాకర్, రాజు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించండి

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ విధిగా పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించాలని కుల్కచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలో దుకాణ సముదాయాల వద్దకు వెళ్లి పన్నులను వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పన్నుల ద్వారా వచ్చే ఆదాయం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాండూరు టౌన్: మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనున్నట్లు తాండూరు విద్యుత్ డీఈ భానుప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. తాండూరు మున్సిపాలిటీ, తాండూరు, పెద్దే ముల్, బంట్వారం మండలాల పరిధిలో ఉద యం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో నిలుపుదల ఉంటుందని, ప్రజలు గమనించగలరని డీఈ కోరారు.

సంజీవ స్వామి ఆలయ కమిటీకి దరఖాస్తులు

దోమ: దొంగఎన్కెపల్లి గ్రామంలోని శ్రీ సంజీవ స్వామి దేవాలయ నూతన పాలకమండలి ఏర్పాటుకు ఆసక్తి గల వ్యక్తుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆలయ చైర్మన్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆలయ కమిటీ పాలకవర్గ ఎంపిక కోసం 20 రోజుల గడువులోపు ఆసక్తిగల వారు దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆర్థికసాయం అందజేత

దోమ: నిరుపేదలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని బొంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కోళ్ల సురేష్ అన్నారు. శుక్రవారం బొంపల్లి గ్రామానికి చెందిన సంద వినోదమ్మ మృతిచెందారు. విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బాధిత కుటుంబీకులకు ఆర్థిక సహాయాన్ని అందించారు. రాము, శేఖర్,బాల్‌రాజ్,యాదయ్య,ప్రభు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

పరిగి: రోడ్డు ప్రమాదంలో గురువారం మృతి చెందిన యువకుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి భరోసానిచ్చారు. మండలంలోని పాల్కంపల్లికి చెందిని సాయితేజ(21), శివకుమార్(22)లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మృతుల కుటుంబాలను శుక్రవారం పరామర్శించారు. రోడ్డు ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులు జాగ్రత్తగా ఉండాలి

ఎంపీడీఓ శైలజారెడ్డి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శైలజారెడ్డి

మోమిన్‌పేట: పంచాయతీలలో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైనందున కార్యదర్శులు జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీఓ శైలజారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాలలో పంచాయతీ పాలకవర్గం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైందన్నారు. కావునా ప్రతి గ్రామ కార్యదర్శి అప్రమత్తంగా ఉండాలన్నారు. పారిశుద్ధ్యం, పరిశుభ్రత, తాగు నీటి సౌకర్యం తదితర పనులపై ఎప్పటికప్పుడు ప్రత్యేకాధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఏఈఈ పీఆర్ ప్రణీత్‌కుమార్, ఏఓ జయశంకర్, ఎంపీఓ యాదగిరి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దోమ: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో స్కావేంజర్ పోస్టు ఖాళీగా ఉందని దోమ మండల విద్యాధికారి హరిశ్చందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగానికి 7వ తరగతి చదివి ఉండాలని అదే విధంగా 18 సంవత్సరాల నుంచి 45 ఏళ్ల లోపు ఉండాలని పేర్కొన్నారు. 5వ తేదీ లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.